కలకాదుసుమా!

[కథానిక]

●

'అమరేంద్ర'

వాన పొద్దుటినించీ ఒక్కవరసన కురుస్తోంది. ఆకాశంకేసి చూస్తుంటే ఇంతలో వెలిసే ఆశలు కనిపించటం లేదు. వర్షదేవత ప్రతాపమంతా ఆపూరిపడిసెమీదే చూపిస్తోంది. గాలికి ఎగిరిపోయిన కప్పు సందుల్లోంచి లోపలికి వాన కురుస్తోంది. మరీ ధారలుగా కురిసేచోట దుర్గ బిందెపెట్టింది. ఆ బిందె మీద జలతరంగిణి వాయిస్తూ వాన-చినుకులు ధనధనా పడుతున్నాయ్. "వానాలు కురవాలి, వరిచేలు పండాలి, మా అమ్మ వండాలి" అంటూ పెద్దకొడుకు రంగడు గంతులేస్తున్నాడు. అన్నగారి పాటకి అనుగుణంగా తమ్ముడు కృష్ణుడు నీళ్లతో నిండిన బిందెమీద వెదురు కర్రతో తాళం వాయిస్తున్నాడు. పిల్లల అల్లరి చూసేసరికి తండ్రి శ్రీహరికి శివాలు ఎత్తినయ్. పెద్దకొడుకు చెవి గట్టిగా పిండుతూ "వెధవా, ఎప్పుడూ వెధవ ఆట లేనా? పద, వెళ్లు, ఎక్కడైనా దోసకాయలు కోసుకురా. అల్లా చూస్తావేం? నీకే చెప్పేది; వెధవా, కదులు ఇక్కణ్ణుంచి" అని అరిచాడు.

పదేళ్ల రంగడు తండ్రి-చీవాట్లకీ, దెబ్బలకీ లొంగక నదురూ బెదురూ లేకుండా ముఖం చిట్లిస్తూ తలబిరుసుగా "నువ్వు పోరాదూ? ఇంట్లో నువ్వు చేసే పనేం మునిగిపోతోంది? నువ్వు పో" అన్నాడు.

"ఏమిటే, తొండ ముదిరి ఊసరవిల్లి అయిందే? చాలాదాకా వచ్చిందే వ్యాపారం! పదేళ్ల వెధవకి ఇంత తలపొగరా? నీ డొక్క చీరేస్తాను. నీ తలకాయ గోడకేసి కొట్టి వెయ్యిముక్కలు చేస్తాను—" అంటూ చెయ్యి ఎత్తాడు శ్రీహరి.

అంతే, ఎత్తినచెయ్యి ఎత్తినట్లే నిలబడిపోయింది. దుర్గ వచ్చికొడుకుముందు నిలబడింది. తల్లిని చూడగానే రంగడికి ఎక్కడలేని ధిలాసా వచ్చింది. "ఎందుకు వాణ్ణి అనవసరంగా కొడతారు? వాడేం తప్పుమాట అనలేదే? ఇంట్లో గుడ్డిగుర్రాలకి పళ్లుతోముతూ కూచోకపోతే మీరే వెళ్లకూడదా? దమ్మిడీకి కొరగాని మీరు వాణ్ణి దెబ్బలుకొట్టి కట్టుదిట్టం చేస్తారా? ఏడిసినట్లే వుంది! ముందు మీరు వెళ్లండి." అని దుర్గ కొడుకుతరపున వకాల్తు పుచ్చుకొని వెనకేసుకొచ్చింది.

పట్టరాని కోపంతో శ్రీహరి "నేనా? నేను వెళ్లనా? వెళ్లగలిగితే ఈ వెధవాయిని ఎందుకు బతిమాలుకుంటానూ?" అంటూ కాలుజాపి, "ఇదిగో చూడు, పాదం నేలమీద ఆనటం లేదు. మొన్న పెద్ద ముల్లు విరిగింది. మొన్న గుమ్మడితోటలో గుచ్చుకుంది. వెంటనే తియ్యటానికి వీలులేకపోయింది. దారినపోయే మనిషి ఒకడు "ఎంతకి కొన్నారు?" అన్నాడు. అణాకి కొన్నా నన్నాను. "అరెరే! బజార్లో కానీకే యిస్తున్నారు" అన్నాడు. అంతా లాభమేగా అని నాలో నేను అనుకున్నాను. ఈముల్లుబాధే నష్టం. ఇంట్లో గుమ్మడికాయ పడేసి ముల్లు తీసేసి సున్నం వేశాను. కాని అప్పట్నుంచీ అరికాలు నేలమీద ఆనితే ప్రాణం పోతోంది" అని దీనంగా వివరించాడు.

"మీకు తగిన శిక్షే జరిగింది. ఎక్కడికైనా ఏవస్తువుకోసమైనా వెళ్తే ఎంత జాగ్రత్తగా మెలగాలీ! సరే, పోనివ్వండి. వాణ్ణి దోసకాయలకి ఎక్కడికి పంపుతున్నారు?"

"నేనేం ఢిల్లీకి పంపటంలేదులే. ఊరిబైట రామయ్యగారి దోసతోటలో భలే మంచికాయ లున్నయ్"

"కాని వాణ్ణి ఎవరైనా పట్టుకుంటారేమో, చిన్నవెధవని" అంది దుర్గ.

"ఏకిశారు, వాణ్ణి పట్టుకోకేం? అలికిడి విని వాళ్లు వచ్చేసరికే కంచె దూకి పారిపోయి రావచ్చును."

"చిన్నకుంకకి చేతకావద్దూ?"

"ఎందుకు చేతకాదు? ఒరేయ్ రంగా, సరిగ్గా నాబుజాలఎత్తున వుంటుందిరా. ఎక్క లేవుట్రా ?"

"ఓ" అని ఒక్క గంతు వేశాడు రంగడు.

"చూశారా, మరి, ఇదంతా వివరంగా చెబితే వాడు వెళ్తాడు కాని తిడితే ఏం లాభముండీ? నాయనా రంగా, వెళ్లిరా. మా బాబువికాదూ. దోసకాయలు కోసుకురా బాబూ" అంది దుర్గ కొడుకుని లాలిస్తూ.

"ఫో, నే వెళ్లను. నిన్నసాయంత్రం నే వెళ్లలా ? వెళ్లగానే వాళ్ల తోటమాలి బెత్తం పుచ్చుకుని చూడు వీపు ఎల్లా చిట్లగొట్టాడో ? చూడు, ఇదుగో నీ చేత్తో నిమురు."దుర్గ కొడుకువీపుచేత్తో నిమిరి, బుజ్జగించి "ఫరవాలేదులే బాబూ వెళ్లు. నిన్న వెళ్ల కూడనివేళకి వెళ్లావు. ఇవాళవెళ్తే నిన్నెవ్వరూ పట్టుకోలేరు. వాన జోరున కురుస్తుంటే కాపలా ఎవరుంటారు ? నెమ్మదిగా వెళ్లి, నాలుగువైపులా పారజూచి దడి దూకు. కాయలు కోసుకుని వెనక్కి తిరిగి చూడకుండా దౌడుతియ్యి"

కొడుకు పరిగెత్తుకుని వెళ్లాక శ్రీహరి "ఇవాళ దోసకాయిపప్పు చెయ్యవే" అన్నాడు.

దుర్గ చేతులు తిప్పతూ "బాగానే వున్నయ్ మీ మనసులు. నాకు బంగాళదుంపవేపుడు తినాలని మనసుగా వుంది. ఇంట్లో పప్పగింజ అన్న మాట లేదు. ఖింగ మెతుకు లేదు మీసాలకి సంపెంగనూనె!" అని కసురుకున్నది. చేసేది లేక శ్రీహరి బెల్లం కొట్టిన రాయిలాగా కూచుండిపోయాడు.

దోసకాయలు వచ్చేలోపుగా ఎక్కణ్ణుంచో ఒక వుత్తరం వచ్చింది. టపాబంట్రోతు దారిన పోతూ ఉత్తరం వసారాలోకి విసిరి వెళ్లిపోయాడు.

ఆ వుత్తరం చేత్తో పుచ్చుకుని శ్రీహరి కొంచెంసేపు నిశ్చేష్టుడై కూచున్నాడు. అతనికి గడిచిన మూడేళ్లనుంచీ ఒక్క ఉత్తరమైనా రాలేదు. అతని అన్నగారు బతికున్నంతకాలమూ ప్రతినెలా ఒకటో తేదీన మనియార్డరు వచ్చేది. కింద కూపనులో అన్నగారు రెండు పంక్తులు రాసేవాడు. పిల్లల యోగక్షేమాలు అడుగుతూ అందరికీ తన ఆశీస్సులని అందజేస్తూవుండేవాడు. తరవాత ఒకరోజున అన్నగారి ఆకస్మికమరణవార్తని మోసుకుని ఒక కార్డు వచ్చింది. అందగానే దాన్ని ఆచారంప్రకారం చించిపారేశాడు. అంతకి తప్ప ఆకొంపఅంతా గాలించినా ఒక్క ఉత్తరం ముక్కా దొరకదు.

కొంచెంసేపటికి శ్రీహరి వుత్తరం చదవటం మొదలుపెట్టాడు. వసారాలో ఇంకోమూల దుర్గ అటుకులు వేయిస్తోంది. టపాబంట్రోతు ఉత్తరం పడేసి వెళ్లటం చూసి మళ్లీ తన పనిలో తను మునిగింది. చదవగానే అందులో విశేషాలు భర్త తనకి వెంటనే చెబుతాడని దుర్గదృఢవిశ్వాసం. పగలంతా ఇంట్లో ఒకటే గందరగోళం. కాస్సేపు నవ్వులతోనూ, కాస్సేపు తిట్లతోనూ వాళ్ల కాలం గడిచిపోతుంది. చుట్టుపక్కల ఇరుగు పొరుగు లేని ఒంటరిగుడిసె. అందువల్ల దుర్గ స్వగతాలతో పొరుగులేని కొరతని తీర్చుకోటం నేర్చుకుంది. భర్త ఇంట్లో లేనప్పుడు దుర్గ ఒక్కత్తే వసారాలో కూచుని తన పుట్టింటివారి ఖ్యాతినిగురించీ, అత్తింటివారి ఖ్యాతినిగురించీ తలపోస్తూవుంటుంది. కాని భర్త ఇంటికి రాగానే తిట్లతోనూ, శాపనార్థాలతోనూ సత్కరిస్తుంది. ఆ ఊళ్లో కోమటికొట్లో గుమాస్తాపని చేసి పదిహేను రూపాయలు తెచ్చుకునే శ్రీహరిసంసారం ఎల్లా గడుస్తున్నదా అని అందరికీ ఆశ్చర్యంగా వుంటుంది.

ఇంతలో రంగడు తిరిగివచ్చి నాలుగైదు నవనవలాడే దోసకాయలు కోసుకువచ్చి వసారాలో పారేశాడు. కృష్ణుడు గోళ్లతో కాయల్ని గుచ్చుతూ తనకి పెట్టమని గొడవ సాగించాడు. అటుకులు పొయ్యిమీదినించి దింపి దుర్గ పిల్లలకి పెట్టడానికి తీసుకొచ్చింది.

కాని శ్రీహరి ఉత్తరానికే కళ్లప్పగించి కూచున్నాడు. దోసకాయలు తరుగుతూ దుర్గ "ఏమండోయ్? మిమ్మల్నే పిలుస్తున్నది? అల్లా కూచున్నారేం కొయ్యబొమ్మలాగా? మాట్లాడరేం, దయ్యం

పట్టలేదుకదా?"అని అరిచింది. బదులుగా శ్రీహరి ఉత్తరం దుర్గమీదికి విసిరేశాడు. "మీకు సిగ్గేమైనా వుందీ? నాకు బాలశిక్షఅయినా కొనిపెట్టినపాపాన పోయారా? ఒక్క అక్షరంముక్కయినా నాకు చెప్పారా?" అంది దుర్గ కోపంతో.

శ్రీహరి నవ్వాడు. ఆమెకి చదువు చెప్పించటం అతని బాధ్యత కాబోలు! ఆమె పుట్టింటివారు అంత గొప్పవారని తెగ ఉబ్బిపోతుంది. మరి వాళ్ల బాధ్యత ఏమీ లేదు కాబోలు!

శ్రీహరినవ్వు విని దుర్గ మండిపడింది; ఉత్తరం విసిరిపుచ్చుకుని మొగుడిముఖాన గిరాటువేసింది. "నవ్వుతున్నారా పైగా? చాల్లెండి. సిగ్గులేని ముఖానికి నవ్వే సింగారం"అంది.

దుర్గ కాపురానికి వచ్చి చాలాకాల మయింది. ఆమెతత్వం శ్రీహరికి బాగా వంటపట్టింది. ఇంకా సంభాషణ పెంచితే ఉపవాసం పడుకోవలసివస్తుం దని గ్రహించాడు. తరిగిన దోసకాయముక్కలూ, వేయించిన అటుకులూ అతన్ని ఊరుకోనివ్వటం లేదు. అందుకనే నెమ్మదిగా "ఆఁ, ఏం లేదు. మా అమ్మాయి వస్తానని వుత్తరం రాసింది" అన్నాడు.

"అమ్మాయా, వస్తుందా?" అని దుర్గ ఆశ్చ ర్యంగా అడిగింది.

"అవు నవును. మాఅన్నయ్యకూతురు. మనకి డబ్బు పంపేవాడే-ఆయనకూతురు"

"తెలుసును బాబూ తెలుసు. నేనంత మొద్దుని కాను. మీరు ఇంత శ్రమపడి వివరించక్కర్లేదు. అన్నగారంటే అంత ఇదయిపోతారేం? ఆయనగారు మనకేం వేలకివేలు పెట్టారా? అయినా, చేతకాని తమ్ముడికి సాయం చేయటం అబ్బురమా? మా అన్నయ్య చూడండి—"

"సరే, మీఅన్నయ్యనిగురించే చెప్పు"

"మీకు కొత్తగా చెప్పాల్సిం దేముంది? వాళ్ల మర్యాదలూ వాళ్ల పద్ధతులూ—" అంటూ మధ్యలో ఆగి "అయితే, ఆ అమ్మాయి ఏమని రాసిందండీ?" అని అడిగింది దుర్గ.

"నాకు చాలా చిత్రంగా వుంది. అది ఇక్క డికి వస్తుందిట" అని భర్త అనగానే దుర్గ ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసింది.

శ్రీహరి "నిజంగానే వస్తుంది. ఇవాళో రేపో" అని మళ్లీ అనేసరికి దుర్గ "ఓ" అంది.

"ఓ ఏమిటి? నీ కేమీ అర్థంకావటం లేదా?"

"అవును, నా కెందుకు అర్థం అవుతుందిలెండి. నేను అన్నం తినటం లేదుగా. గడ్డి తిని బతుకున్నాను కాదూ? నా కెందుకు అర్థంఅవుతుందీ?"

"అయితే ఏమిటి తెలిసింది?"

"ఏమిటా? మీ అన్నగారి కూతురు ఇక్కడికి వస్తోంది. ఊరికే కాదు. మననీ మన ఇంటినీ భక్షించ టానికి వస్తోంది."

"అదేమిటి? అల్లాగంటా వేమిటి?"

"ఏముంది? మట్టిబుర్ర! అల్లా వెర్రిగా చూస్తా రేం? రండి. కాసిని అటుకులు నోట్లో వేసుకోండి. తరువాత మాట్లాడుకుందాం" అని కొంచెంసేపున్నాక "ఆ పిల్ల ఇంట్లో తిని ఇంటివాసాలు లెక్కపెడు తుంటే నేను చూస్తూ వూరుకోలేను. రాగానే వచ్చిన దోవనే సాగనంపుతాను" అంది.

శ్రీహరి నిట్టూర్పు విడిచి "నువ్వు పొరబాటు పడుతున్నావు" అన్నాడు.

"నేనా, నేనేం పొరబాటుపడటం లేదు. ఆ అమ్మాయి ఇక్కడికి భాగం పంచుకోటానికి రావ టం లేదా?" అని అడిగింది.

"ఊఁహుఁ. కాదు"

దుర్గ ఆశ్చర్యపోయింది. "మరి అయితే దేనికి వస్తోంది? తైతక్కలాడి నలుగురికీ తన అందాన్ని చూపించటానికి వస్తోందా?"

"కాదు. విను. బడి లేని వూళ్లలో బళ్లు పెట్టే సంఘం ఒకటి వుందిట. పిల్లలకి చదువు చెబుతారుట. అందుకే మాయ ఇక్కడికి వస్తున్నదిట. ఇక్కడ బడి పెడుతుందిట"

"ఓహో, అల్లాగా" అని పెదవి విరిచి అటుకు లకి నెయ్యి రాస్తూ కూచుంది దుర్గ.

అటుకులు పటపట నములుతూ "అయితే రమ్మని రాయనా ?" అన్నాడు. "రాదలుచుకుంటే రానివ్వండి" అంది దుర్గ. "వస్తే అది ఎక్కడ పడుకుంటుంది ?"అన్నాడు శ్రీహరి.

"అది మీరే తేల్చుకోవాలి !"

అమర్నాడుకూడా చినుకు పడుతూనే వుంది. ఒక గుడిసెబండీ వచ్చి శ్రీహరిగుడిసెముందు ఆగింది. దుర్గ పిల్లలతో వసారాలో నిలుచుని వుంది. శ్రీహరి వానరోజు మంచి అదనుకనుక కూరగాయలు సంపాదించుకురావటానికి వెళ్లాడు.

ఒక నాజూకుపిల్ల బండీ దిగింది. చేతులో ప్లాస్టిక్ సంచీ లేదు. కాళ్లకీ జోడు లేదు, కళ్లకీ జోడు లేదు. మనిషి పొడుగ్గా అందంగా వుంది. వానజల్లుకి తడిసిన ఆమెముఖం వింతసోయగంతో మెరుస్తోంది. చీర కట్టుకునే పద్ధతి కొంచెం వేరుగా వుంది. అంతకి తప్ప ఆ అమ్మాయిని పల్లెటూరిముఖమే ఎరగని బస్తీపిల్ల అనుకోటానికి ఆస్కారం లేదు. బండీ దిగి బండి మనిషితో "అబ్బీ ఆ పెట్టే, ఆ బుట్టా లోపలికి తీసుకురా. ఇల్లు ఇదే కాదూ ?"అంటూ చకచకా వసారాలోకి వెళ్లింది.

కోపంతో నిండిన చూపుల్తో దుర్గ ఏదో అనబోతుండగా ఆ అమ్మాయి వంగి దుర్గకాళ్లకి దణ్ణం పెట్టింది. కోపం ఆపుకుంటూ, మర్యాదకి దుర్గ "లే అమ్మ లే. నువ్వు వెయ్యేళ్లు సుమంగళివై వర్ధిల్లు. నీ మంగళసూత్రం—"

అంటుండగానే అమ్మాయి నిఠారుగా నిలబడి చిరునవ్వుతో "అప్పుడే అంత పెద్దదీవన లెందుకు పిన్నీ ? నా కింకా పెళ్లి కాలేదుగా"అంది.

దుర్గ నివ్వెరబోయి నోరు తెరచి ఆ అమ్మాయి కేసి చూస్తూ నిలబడింది. ఇంత పెద్దపిల్లకి ఇంకా పెళ్లి కాకపోవటం యేమిటి ? పైగా పెద్దవాళ్లముందు తన పెళ్లిసంగతినిగురించి ఎంత అవలీలగా నవ్వుతూ మాట్లాడుతోంది! కాస్తయినా సిగ్గులేని పిల్ల అని దుర్గలో లోపల అనుకోసాగింది.

ఇంతలో బండీవాణ్ణి పంపించేసి "పిన్నీ, నా పేరు మమత. ఏంరా బాబూ, అల్లా రెప్ప వాల్చకుండా చూస్తున్నావ్ ? నా దగ్గరికి వస్తావా తమ్ముడూ ?" అని చిన్నకుర్రాణ్ణి పలకరించింది. బదులుగా తమ్ముడు తల్లిచాటుగా నక్కి తంతాను అంటూ కాలు ఎత్తాడు.

మమత నవ్వుతూ "తంతావా ? తప్పు కాదూ ? నేను నీకు అక్కనికాదూ ? అక్కని తంతే కళ్లు పోతయ్"అంది. కుర్రాడు "తప్పా, కాదు. తంతా, మళ్లీ తంతా"అని కాలు ఎత్తాడు. దుర్గ కొడుకుని కొప్పడలేదు. అంతే ముట్టకుండా మమతని ఉద్దేశించి "నువ్వెక్కడ వుంటావూ ?"అని అడిగింది. చిరునవ్వుతో మమత అంది—"తల్లి ఎక్కడ వుంటే కూతురూ అక్కడే. ఈ పాకలో నీకు చోటున్నప్పుడు నాకూ వుంటుందిగా."

"ఉంటే మంచిదే. కాని నువ్వు మాలాగా ఈ ముడిబియ్యం, ఈ కారంపచ్చళ్లూ తినగలవా? నీకు పాలూ పెరుగూ నెయ్యీ కాఫీ కావద్దూ" అంది దుర్గ ఎత్తిపొడుపుగా.

"అవునవును. బంగాళదుంపలు, కాబేజి, ఓవల్టిన్నూ ఇంకా ఇంకా చాలా కావాలి" అంది మమత ఛలోక్తిగా.

అది గ్రహించలేక దుర్గ చాలా విరుపుగా అంది—"ఆ రాజవైభవాలన్నీ మీ బస్తీల్లో జరగచ్చును. కాని పల్లెటూరి బీదవాళ్లం ఆ ఉడిగాలన్నీ ఎల్లా జరపగలం ?"

పిన్నిమాటలు పరిహాసానికి అన్నవి కావని మమత తెలుసుకోగలిగింది. "నా కేమీ అక్కర్లేదు పిన్నీ. మీ రేది తింటే నాకూ అదే పెట్టండి. కళ్ల కద్దుకుని తింటాను. ఏంరా బాబూ, మిఠాయి తింటావా ?" అని బుట్ట విప్పింది.

ఒక్కసారిగా ఎక్కడలేని చొరవా చనువూ వచ్చింది పిల్లలకి. మమతని చుట్టేసి "నే తింటా. నా క్కావాలి నా క్కావాలి" అని అరవటం మొదలు పెట్టారు. దుర్గకూడా దగ్గరికి వచ్చి నిలబడింది. మమత ఒక్కొక్కళ్లకి రెండేసి వుండలు పెట్టబోతోంది. అమాంతం దుర్గ బుట్ట తను లాక్కుని "నువ్వు వెళ్లి కాస్త విశ్రాంతిపుచ్చుకో మమతా. వీళ్లు రాక్షసులు

అంతా ఒక్కక్షణంలో మింగేస్తారు" అంది. పిల్లల చేతుల్లో తలొక వుండా పెట్టి బుట్ట వాళ్ళకి అందకుండా గూట్లో పెట్టింది దుర్గ.

బుట్టంతా తనముందు నైవేద్యం పెట్టలేదని పిల్లలు దుర్గని చెడ తిట్టిపొయ్యటం విని మమత విస్తుపోయింది.

దుర్గ గొంతుచించుకుని అరవటం మొదలు పెట్టింది. "ఎప్పుడూ పరగడుపే ఈ వెధవలకి. పంది వెధవలు. వీళ్ళు ధస్తే పీడ విరగడైపోతుంది. హాయిగా వుంటుంది నా ప్రాణానికి."

రంగడు, "ఎవర్ని చావమంటావు, నువ్వే చావు" అని కేకపెట్టాడు. "ఇంత వొళ్ళుపొగరా? తొక్కి నారతీస్తాను" అని దుర్గ వాడిమీదికి ఉగ్రంగా ఉరికేసరికి చెప్పరాని పాడుతిట్లు తిడుతూ రంగడు వసారా దూకి వానలో తడుస్తూ పరుగుతీశాడు.

దుర్గ మమతకేసి చూసి "ఎల్లాగో రానే వచ్చావు. కష్టమో సుఖమో నాలుగురోజులుండమ్మా. ఇదుగో ఈ సామానుగదిలో పడుకో. దాన్నిండా చెంబులూ, తప్పేలాలూ, తట్టలూ, బుట్టలూ. ఎల్లా పడుకుంటావో పాపం! ఆ బల్లమీద పడుకో. నీ పెట్టె నాగదిలో పెట్టించుతాను. ఎందుకైనా మంచిది." అంది. ఎల్లాగో మమతకి ఇంట్లో చోటు దొరికింది.

మమత కాళ్ళూ చేతులూ కడుక్కుని సామాను గదిలోకి వెళ్ళింది. గదినిండా కుండలూ బొచ్చెలూ, తట్టలూ బుట్టలూ చిందరవందరగా వున్నయ్. బల్లమీద కూచునేసరికి అది విరిగిపోయేట్లుగా కిర్రుకిర్రుమంది. ఊసులాడిపోయింది. చుట్టూ ఎలుకపెంటలు కుప్పలుగా పడివున్నయ్. ముక్కు మూసుకోవలసివచ్చేటంత మురికికంపు. కాని ఏం చేస్తుంది? అక్కడే పడుకోవాలి. ఎల్లాగో కొంచెం చోటుచేసుకుంది. పక్క పరుచుకోవాలని పరుపుచుట్ట ఇంకో గదిలోంచి పట్టుకురావటానికి వెళ్ళింది. ఇది చూసి దుర్గ గబగబా ఒక బిందెడు నీళ్ళెత్తుకునివచ్చి "వుండమ్మా అల్లాగే నిలబడు కొంచెంసేపు. పరుపుచుట్టని శుద్ధి చెయ్యద్దూ" అని ఏవో మంత్రాలు చదువుతూ పరుపుచుట్టమీద నీళ్ళుజల్లింది. ఎదురుమాట చెప్పకుండా మమత తన శుద్ధిపొందిన, సగంతడిసిన పరుపుచుట్టని మోసుకుపోయింది.

బైటినుంచి కేకలు వినిపించినయ్, "రంగా! రంగా! దొంగవెధవ ఎక్కడికి వెళ్ళాడో! ఇదిగో కూరగాయలు. ఇంట్లోకి తీసుకుపో."

వసారాలోంచి దుర్గ నోటిమీద చెయ్యి అడ్డంపెట్టి, అరవకండి అని సైగచేసింది.

శ్రీహరి ఇది గమనించలేదు. "చావు పాడుముండా! ఇవి లోపలికి తీసుకుపోరాదూ? పైగా అరవద్దంటావా? ఒకమూల కుంటికాలితో చచ్చిపోతుంటే."

"మీరే చావండి" అంటూ దుర్గాంబ కూరల్ని లోపలికి తీసుకుపోయింది.

అన్ని కూరలు తెచ్చిన సంబరాన్ని ఆపుకోలేక "ఇవన్నీ ఎక్కడెక్కడ కోసుకొచ్చాననుకున్నావ్! రామయ్యగారి తోటలో దోసకాయలూ, వీరయ్యగారి దొడ్లో వంకాయలూ—" అని చెప్పబోతుంటే దుర్గ అడ్డంవచ్చి "సంతోషించాం. ఇంక చాలించండి. అట్టే మాట్లాడబోకండి" అంది.

"ఏం, ఎందుకు మాట్లాడకూడదూ? వారం రోజులకి సరిపడ్డ కూరగాయలు తెచ్చిపడేస్తే కమ్మగా తినగలవు కాని—" అని శ్రీహరి అంటుంటే దుర్గ దగ్గరికి వెళ్ళి కోపంతో పళ్ళుకొరుకుతూ "ఉత్త మట్టిబుర్ర. తెలివితేటలు ఏకోశానా లేవు" అని గదికేసి వేలెత్తి చూపించి "వచ్చింది" అంది.

తెలివితక్కువచూపుల్తో "ఎవరూ?" అని అడిగాడు శ్రీహరి. "ఎవరా? మనపాలిటి యమదూత!" అంటూ లోపలికి వెళ్ళింది.

వాళ్ళ మాటలు కొన్ని మమతకి వినిపించినయ్. బల్లమీద పక్క పరుచుకుని బైటికి వచ్చి బాబాయి కాళ్ళకి నమస్కారంచేసింది. "నేను నిన్ననే వద్దామనుకున్నాను బాబాయ్, కాని వీలుపడలేదు. ఎప్పుడో చిన్నప్పుడు చూశాను నిన్ను. 'మాయా' అని పిలిచేవాడివి నన్ను. నాకు నువ్వు యోగమాయ అనే పేరు పెట్టావని నాన్నగారు చెబుతూవుండేవారు" అని సంభాషణ ఆరంభించింది.

"అవునమ్మా మాయా, ఎన్నాళ్లయిందో నిన్ను చూసి" అన్నాడు శ్రీహరి. "ఇప్పుడు నా పేరు మమత. నాకీ పేరు అమ్మ పెట్టింది బాబాయ్. రెంటికీ ఒకటే అర్థంకదూ?" అంది మమత. శ్రీహరికి రెంటి అర్థమూ తెలియకపోయినా "చాలా మంచి పేరమ్మా. ఇదుగో నిన్నే నేవ్. ఇవాళ మాయ వచ్చిందిగా. పప్పుకూర వండరాదూ?" అని కేక పెట్టాడు. విని దుర్గ బైటికి వచ్చి మమత చాటున నిలబడి మూతి ముడిచి శ్రీహరిమీద మెటికెలువిరిచింది. ఇది చూసి చిన్న కొడుకు కృష్ణుడు "నాన్నా, అమ్మ నీమీద ఇల్లా మెటికెలువిరిచింది" అంటూ తండ్రిదగ్గరికి వచ్చి ముఖం మీద తన చేతుల్తో మెటికెలువిరిచాడు.

కొంచెం బెదిరించే స్వరంతో "నాన్నని అల్లా అనచ్చా? తప్పు కామూ?" అంది మమత.

కృష్ణుడు ఇకిలిస్తూ, "నువ్వు కోతివి" అని వెక్కిరించాడు. మమత "తప్పు" అంది కోపంతో కందిన ముఖంతో. జంకూ గొంకూ లేకుండా కృష్ణుడు ఇంకా పెంకిగా "నువ్వు కొండముచ్చువి" అన్నాడు. బెదరించటానికి మమత వాడి చెవి పిండాలని చేత్తో పట్టుకుంది. కొంప మునిగినట్లు ఏడవటం సాగించాడు.

లోపలనించి రుసరుసలాడుతూ దుర్గాంబ "చాలునమ్మా చాలు. బాగానే వుంది. గడపలో అడుగు పెడుతూనే పంతులమ్మలాగా పిల్లలని చెండుతావా? కన్నదాన్ని నాకు లేని పెత్తనం నీ కెందుకూ? కంచకి లేని దురద చామ కెందుకూ?" అని బుసకొట్టింది.

మమత కృష్ణుణ్ణి వొదిలేసి విస్తుపోతూ నిలబడింది. ఇది చూసి శ్రీహరి "పిల్లలు కొంచెం అల్లరివాళ్ళమ్మా, చెప్పినమాట వినరు. వాళ్ళపాపాన వాళ్ళే పోతారు వెధవలు" అన్నాడు.

"వాళ్ళని కొంచెం అదుపాజ్ఞల్లో పెట్టరాదా బాబాయ్?" అని అడిగింది మమత.

బిక్కమొహంవేసి దిక్కులు చూస్తూ శ్రీహరి "ముందు వాళ్ళకి పొట్టనిండా తిండి పెట్టగలిగితే చాలు. కట్టుదిట్టాలమాట తరవాత చూసుకోవచ్చు. అయినా పసివాళ్లు. పెద్దవాళ్లయితే వాళ్లకే కుదురు వస్తుంది"

"ఇప్పుడు ఎన్నోక్లాసు చదువుతున్నారు? ఇప్పుడే వొంచాలికాని పెద్దయితే లొంగుతారా?" అంది మమత. శ్రీహరి తల గోకుకుంటూ "ఇంకొకటి రెండేళ్లు పోయాక బళ్లో వేస్తాను. అందులో నా పరిస్థితి వాళ్ళకి—" అంటుంటే మమత అందుకుని, "నాన్నగారికి చదువుసంధ్యలు లేకుండా దిప్పకాయల్లాగా తిరిగే పిల్లలంటే మంటగా వుండేది. అందుకే ఆయన నీకు ప్రతినెలా డబ్బు పంపిస్తూవుండేవారు" అంది.

దీనికి బదులు చెప్పలేక శ్రీహరి కళ్లని చేతులతో తుడుచుకుంటూ "చూస్తుండగానే మన కళ్లముందు నుంచి అన్నయ్య దాటిపోయారుగా" అని భోరున ఏడవటం మొదలుపెట్టాడు.

మాటలవల్ల లాభం లేదని మమత తెలుసుకుంది. అజ్ఞానం ఊడలువేసిన మర్రిచెట్టులాగా వాళ్ల గుండెల్లో నాటుకుపోయింది. వీళ్లకి బైటిలోకపు వెలుతురే సోకదు. కాని తన సాయశక్తులా ప్రయత్నిస్తుంది. ఈ అజ్ఞానాన్ని కూకటివేళ్లతో పెకలించివెయ్యాలి. తను వాళ్లతో వుంటూ ప్రేమతో వాత్సల్యంతో భయభక్తులతో మెల్లగా వాళ్లని చీకటిలోంచి వెలుతురులోకి నడిపిస్తుంది. ఈ పాడుపడుతున్న పేదగుడిసెలోనే అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసే విజ్ఞాన దీపిక వెలిగిస్తుంది.

ఇంతలో దుర్గ భర్తని ఇంట్లోకి పిలిచి "చూడండీ, మీరు పిచ్చివాళ్ళని నేను వూరికే అంటానా? మన సోదిఅంతా ఆపిల్లముందు ఏకరువుపెడతా రెందుకండీ? నాలుగురోజులుండి తనదారిన తాను పోయే పిల్ల మన కష్టాలు ఆరుస్తుందా? తీరుస్తుందా?" శ్రీహరి "కాదు, చాలా మంచిపిల్ల. ఎంత చక్కగా మాట్లాడుతుందో చూడు."

"అల్లాగే అనుకోండి. ఆ అమ్మాయి భోగాలు పంచమని అడిగితే. అసలురంగు అప్పుడు బైటపడుతుంది" అని దుర్గ చివాట్లుపెట్టింది. మమత అక్కడ వుందని శ్రీహరి తిరిగి చివాట్లు పెట్టకుండా వూరు

కున్నాడు. తననిగురించి ఆ అమ్మాయి ఏమనుకుంటుందో?

"చూడండి. ఈ కూరలు ఎక్కడెక్కడ కోసుకొచ్చారో ఆఅమ్మాయికి చెప్పక్కర్లేదు. చేతనయితే ఇవన్నీ అతి చౌకధరకి బజార్లో కొనుక్కొచ్చానని చెప్పండి. లేకపోతే నేనే సర్దిచెబుతాను" అని దుర్గ అనగానే శ్రీహరి తల వూపాడు.

తలకాయి ఆడించాడు కాని ఎందుకో మనస్సు వికలమై పోతోంది. చిన్నప్పుడు తను ఎత్తుకొని తిప్పిన అన్నగారి కూతురు మమతముందు తనకి బెరుకు దేనికి? సిగ్గు దేనికి? కాని ఆమె చిరునవ్వుముఖం, ఆమె విధేయత, ఆమెనడత, ఆమెమాటతీరూ ఇవన్నీ అతని మనస్సుని సిగ్గుపడేట్లు చేస్తున్నయ్. ఏదో తీరనిలోటు తనలో కనిపించింది. తాటాకులు ఎగిరిపోయిన కప్పూ, పూటకూడా నిశ్చింతగా గడవని నిత్యదరిద్రం—వీటివల్ల గలిగిన లోటుకాదు. చినిగిన గుడ్డలూ, అంతటా దరిద్రం తాండవించే ఇల్లూ—వీటినిగురించి తను మమత ముందర సిగ్గుపడటం దేనికి? తన స్థితిగతులు ఆమెకి తెలియవా? కాని కూరగాయల దొంగతనంమాదిరి నీచపు పనులు చేసినందుకు సిగ్గు, అభిమానం పెనగొని శ్రీహరిని తలక్రిందులు చేస్తున్నయ్. మమతకేసి చూడటానిక్కూడా చిన్నతనంగా ఉంది.

రెండు మిఠాయివుండలు భర్తకి తెచ్చిపెట్టి "తినండి" అంది దుర్గ.

"నువ్వు తిన్నావా?"

"ముందు మీరు తినండి. ఇదిగో చెయ్యి కడుక్కోటానికి నీళ్లు" అని గ్లాసెడు మంచినీళ్లు అందించి "ఏమిటే అంటోంది?" అని అడిగింది.

"ఏముంది అనేందుకు?"

"అదుగో అందుకే నాకు వొళ్లు మండుతుంది. భాగాలు పంచే విషయ మేమైనా ఎత్తిందా?

"మనకేం ఫరవాలేదు. మమత ఆపనిమీద రాలేదులే"

"అల్లాగయితే బడిపెడతానని ఎందు కన్నదీ? ఇక్కడ ఎక్కడ బడిపెడుతుంది?"

"ఇక్కడ అంటే ఈ స్థలంలో కాదు. ఈ వూళ్లో అన్నమాట".

"ఈ వూళ్ళో ఈవిడగారికి జాగా ఇవ్వటానికి ఎవరు కూచున్నారు? చూడండి. నామాట వినండి. సెంట్లదగ్గరనించి లెక్కలు కట్టించి విడగొట్టుకుంటుంది. అందుకే వచ్చింది ఆపిల్ల."

"నువ్వు చాలా నీచంగా మాట్లాడుతున్నావు."

"ఏమిటే?" అని దుర్గాంబ ఉగ్రస్వరూపం ధరించేసరికీ శ్రీహరి,

"ష్. ఊరుకో. వింటుంది" అన్నాడు.

"వింటే విననివ్వండి. నేనెల్లాగో పరువు తక్కువదాన్నేగా."

"అది కాదు బాబూ. మన బుర్ర లెప్పుడూ చిన్నవిషయాలమీదికే పోతయ్. కాని మమత మన లాగా కాదు."

"అదేం దేవతా? దిగివచ్చిందా?"

"కాదుకాని ఎందుకో దానిముందు నాకు చిన్నతనంగా వుంది. కాకటానికి దానికంటె వయస్సులో పెద్దవాణ్ణే. దాని కేం తక్కువ అని ఇక్కడికి వచ్చిందీ? మనతోపాటు కష్టాలు పడవలసిన కర్మం దాని కెందుకు? అయినా వేటినీ లక్ష్యపెట్టకుండా వచ్చింది. ఈఊరి పిల్లలకోసం బడి పెట్టి వాళ్లని మంచిదారిలో పడేద్దామనే ఆశతో ఇంత దూరం వచ్చింది. ఇటువంటి పని తలపెట్టిందంటే దాని హృదయం ఎంత విశాలమైనదో నువ్వే ఆలోచించు."

ఈ మాటలు వినేసరికీ దుర్గ కోపంతో భగ్గున మండిపోయింది. "అయితే వెళ్లి ఆ అమ్మాయికాళ్లు కడిగి నీళ్లు నెత్తిన జల్లుకోండి. నే నిల్లాంటివాళ్లని చాలామందిని చూశాను. అంతా కపటనాటకం. ఒడీ లేదు నాబొందా లేదు. ఆస్తి పంచుకోటానికి ఇదొక ఎత్తు."

"ఎందుకులే ఇప్పు డీవిషయంమీద రాద్ధాంతం. వెళ్లి నీపని చూసుకో"

"వెళ్తున్నానుకాని ఇటుసూర్యు డటు పొడిచినా నేను చెప్పినమాట అక్షరాల నిజమౌతుంది. అంటూ వంటింట్లోకి వెళ్లింది.

శ్రీహరి "దీని మాటలు వేదవాక్యాలు కాబోలు! అని వెటకారంగా తనలో అనుకున్నాడు.

తన పక్క సవరించుకొని మమత వసారాలోకి వచ్చి బాబాయిపక్కన కూచుని "బాబాయ్ నేను రంగణ్ణీ, కృష్ణణ్ణీ బళ్లో వేస్తాను"అంది.

శ్రీహరి సంతోషంగా "మంచిదమ్మా మంచిది" అన్నాడు.

"ఇంటికప్పు ఎగిరిపోయింది. వానలు వెనకపట్ట గానే మళ్లా కప్పించాలి"అంది మమత. బదులుగా శ్రీహరి నిట్టూర్పు విడిచిపూరుకున్నాడు. ఇది చూసి మమత "నే నెల్లాగా కొన్నాళ్ల పాటు వుంటాను. నేనే కప్పిస్తా. నీకేం అభ్యంతరం లేదుగా?" అన గానే శ్రీహరి సంతోషంగా తన కేమీ అభ్యంతరం లేదని తల ఊపాడు.

కొంచెంసేపన్నాక మమత "ఈ స్థలంలో బడి కట్టిస్తాను. ఏం బాబాయ్ ఏమంటావ్?"అంది.

శ్రీహరిమనస్సులో దుర్గమాటలన్నీ గింగురు మన్నయ్. ఇదంతా ఒక నాటకంలాగా కనిపిస్తోంది. మమతకేసి కొరకొరా చూశాడు. చిరునవ్వుతో మమత "ఇంతదగ్గరలో బడి వుంటే పిల్లల గోడవతో నీకు మధ్యాహ్నం నిద్రపట్టదని భయపడుతున్నావా బాబాయ్?"అంది. అతికష్టంమీద శ్రీహరి చిరునవ్వు నవ్వగలిగాడు.

"నీ కా భయం అక్కర్లేదు బాబాయ్. మేం పాఠాలు చెప్పే పద్ధతే వేరు."

శ్రీహరిముఖం కందిపోయింది. బదులు చెప్ప కుండా కూచున్నాడు. "బాబాయ్ వాన వెలవగానే ఇక్కడొక చిన్న పాక వేయిస్తాను"అంది మమత.

శ్రీహరికి రూఢిగా తెలిసివచ్చింది. అక్షరాలా దుర్గ చెప్పింది నిజంగా తోచింది. ఈ తియ్యటిమాటల చాటున స్వార్థం దాగివుందేమో నని అతనికి అను మానం కలుగుతోంది.

"ఏం బాబాయ్ మాట్లాడవేం?"అంది మమత అమాయకపుపిల్లలాగా.

"వీల్లేదు; మాయా! వీలుకాదు" అన్నాడు శ్రీహరి.

"ఎందుకని బాబాయ్? కారణం ఏమిటీ?"

"ఆస్తి పూర్తిగా పంపకం జరిగితేకాని వీల్లేదు."

"ఏమిటి బాబాయ్ నీమాటలు? ఆస్తిపంపక మేమిటి? ఇదంతా నీదేకదా"అంది మమత.

గొంతు సవరించుకొని సంకోచాన్ని అణుచు కుని శ్రీహరి "కాదమ్మా ఇది ఉమ్మడిఆస్తికదూ. పంచుకునే ఏర్పాట్లు—"అంటుంటే మమత అడ్డు వచ్చి "కాదు బాబాయ్. అంతా నీదే. ఒక్క అంగుళం కూడా నాన్నగారిది కాదు"అంది.

"దీనికి లా వొప్పుకోవద్దుటమ్మా?" అన్నాడు శ్రీహరి.

"లాసంగతి నాకు తెలియదు బాబాయ్. నాన్నకి నే నొక్కతె నేకదా. నేను చెబుతున్నాను; ఈ ఆస్తి అంతా నీదే; అంతా నీదే. కావాలంటే కాగితంమీద రాసికూడా ఇస్తాను" అంది మమత ఆవేశంతో. ఈ మాటలు విని శ్రీహరి సిగ్గుపడ్డాడు. అంతకి మించిన సంతోషంతో అతనిగుండె కొట్టుకో సాగింది. మమతకేసి చూస్తుంటే అతని కళ్లలో అశ్రు వులు చిందినయ్. తల వూపుతూ "తెలుసమ్మా మాయా! నీసంగతి నాకు తెలుసు, నాకు తెలుసు" అని సంతోషంతో అన్నాడు.

పొద్దుకుంకే వేళకి మధ్యాహ్నంభోజనాలు అయినయ్. కాని వాన ఎడతెరిపి లేకుండా కురుస్తూనే వుంది. వసారాలో కూచుని మమత శ్రీహరితో చిన్న నాటి ముచ్చట్లు చెబుతోంది. పనివంకమీద ఆగది లోంచి ఈ గదిలోకి తిరుగుతూ దుర్గ ఒక చెవి వాళ్ల సంభాషణకే అప్పగించింది. కాని శ్రీహరి తన్మ యుడై వింటున్నాడు. ఈ పిల్ల అతన్ని బుట్టలో వేసుకునేట్లుంది. తన నాలుకదురద తీరేట్లుగా అమూల్య మైన సలహాలని భర్తకి అందించటానికి దుర్గకి అవ కాశం చిక్కటంలేదు. సుడిగాలిలాగా వసారాలోకి వచ్చి "రాత్రికి ఏం వండమంటారు?"అని అడిగింది దుర్గ. శ్రీహరి చేత్తో బొజ్జ నిమురుకుంటూ ఓగ్గరగా త్రేణుస్తున్నాడు. మమత "నా కేమీ వొద్దు. ఇంకా రాత్రికూడా తింటే నేను బతకను. ఇంకా

ఇప్పుడేం వంట చేస్తావు పిన్నీ? కాస్సేపు వొళ్లు వాల్చుకో"అంది.

"అంత అదృష్టంకూడానా? అస్తమానం మరలాగా ఆడుతూవుండాల్సిందే. రాత్రికి భోజనం చెయ్యకపోతే పోయి పెందలకాడే పడుకో. తెల్లారి మాట్లాడుకోవచ్చునులే" అంది దుర్గ.

"నువ్వుకూడా వచ్చి కాస్సేపు కూచో పిన్నీ."

"అమ్మో, అంత అదృష్టంకూడానా నాకు! పగలంతా ఎల్లా పనితో సతమతమవుతున్నానో చూస్తున్నావుగా. అయినా ఇంట్లో చుక్కయినా కిరసనాయిలు లేదు." అంది దుర్గ సాధింపుగా. శ్రీహరి చికాకుముఖంతో "అయితే వెళ్లి పడుకో తల్లీ. నిన్న రాత్రంతా నీకు నిద్ర లేదుకాబోలు. పడుకో" అన్నాడు. కాని అప్పుడే పోయి ఆ గుహలో చొరబడటానికి మమతకి ఇష్టం లేదు. చిమ్మెట్లూ, బొద్దింకలూ, ఎలుకలూ వాట్లమధ్య ఎల్లా పడుకోవాలో? తలుచుకుంటేనే వొళ్లు జలదరిస్తోంది.

శ్రీహరి లేచి లోపలికి వెళ్లాడు. పిల్లలిద్దరూ అన్నం తినగానే నిద్రపోయారు. ఎంతసేపు తను ఒంటరిగా వసారాలో కూచోగలదు? ఆ చీకటికొట్లోకి పోక తప్పలేదు.

పక్కగదిలోకూడా దీపం లేదు. గుసగుసలు వినిపిస్తున్నయ్. "నేను చెప్పింది నిజమయిందా లేదా? నేను అన్నంతా జరిగిందా లేదా?"

ఒకళ్లకొకళ్లు కనబడటంలేదు. శ్రీహరి మెదలకుండా పడుకున్నాడు. కోపంతో దుర్గ ఒక గిల్లు గిల్లి "నోరు పడిపోయిందా? మాట్లాడరేం?" అంది. చికాకుతో శ్రీహరి దూరంగా జరిగాడు.

అంతటితో వూరుకోలేదు. అతనిదగ్గరికి జరిగి "సిగ్గులేనిమొహమా! మాట్లాడూ. ఆ అమ్మాయిని చూడగానే కరిగిపోయారు. అది డబ్బు ఇస్తుంది, పొలం ఇస్తుంది, ఇల్లు బాగుచేయిస్తుంది, పిల్లలకు చదువు చెప్పిస్తుంది. దాని డాబులకి అంతుందా? ఏం, నేను చెప్పింది నిజమయిందా లేదా?" అని నిగ్గదీసింది దుర్గ.

ఎటూ తప్పుకోలేక శ్రీహరి, "తప్పకుండా నిజమే. నువ్వు చెప్పినమాట నిజం కాకుండా ఎల్లా పోతుందీ?" అన్నాడు.

"ఇప్పటికి తెలిసివొచ్చిందా? కానియ్యండి. దానికి నే నీరాత్రే తగిన శాస్తి చేసి మంచి పాఠం చెబుతాను" అంది దుర్గ.

"ఏమిటి? ఏం చేస్తావేమిటి కొంపతీసి?" అని ఆదుర్దాగా అడిగాడు శ్రీహరి.

"చూసుకోండి ఏం చేస్తానో? దాని జుట్టు నా చేతికి చిక్కింది. దాని ఆయువుపట్టంతా ఈ పెట్టెలో వుంది. ఇది చూసుకు నేగా అన్ని బడాయికబుర్లు!"

"ఏమిటీ? ఆ పెట్టె పగలకొడతావా?" అని శ్రీహరి ప్రాణంకిపోతూ అడిగాడు. బదులుగా దుర్గాంబ విషపునవ్వు నవ్వింది.

"వొద్దే! నీకు పుణ్యముంటుంది! ఆ పనిమాత్రం చెయ్యకు. నిన్ను బతిమాలుకుంటున్నాను. నామాట విను. నేను దాన్ని వెళ్లిపొమ్మని చెబుతాను."

"అది ఎందుకు వెళుతుందీ?"

"నీ కెందుకు? ఎల్లాగో పంపిస్తానుగా. నువ్వా పనిమటుకు చెయ్యకు. చేస్తే నాతోడు. ఇప్పటికే ఎందుకో చిన్నతనంగా వుంది. ఇక అసలు తల నరికేసినట్లే అవుతుంది" అని దీనంగా బతిమాలుకున్నాడు.

భర్తనడవడికి దుర్గ ఆశ్చర్యపోయింది. ఇంత చిన్న విషయానికి ఎందు కింత బాధపడతాడు? ఆ అమ్మాయిముందు తలవంపులు జరిగితే ప్రాణమే పోతుందని మాట్లాడతా డేమిటి? ఇతరుల తోటల్లోంచి అవలీలగా కూరగాయలు దొంగిలించే మనిషి, పట్టుబడితే అబద్ధాలు అల్లి తప్పించుకునే మనిషి, ఇవాళ ఎందు కిల్లా మారిపోయాడో దుర్గకి అర్థంకాలేదు. పెట్టెలో బోలెడు డబ్బుండితీరాలి. చేతులో చిక్కిన డబ్బునే అక్కర్లే దంటున్నాడు. ఆ డబ్బంతా తన చేతికి చిక్కితేనా? అందరికీ కొత్తబట్టలు కొంటుంది. గుడిసెకి కొత్తకప్పు వేయిస్తుంది. దొడ్లో వడ్లకొట్టు కట్టిస్తుంది. ఇంటిచుట్టూ మంచి ప్రహరీగోడ కట్టిస్తుంది. ఇంకో చిన్న పాక

వేయించి మంచిపాడిఆవుని కొంటుంది. ఇటువంటి ఆశలెన్నో మనస్సులో మెరిసిపోయినయ్. తీరని కోరికలతో ఆమెగుండె రగిలిపోయింది. రాత్రి వాన హోరు ఎక్కువైనకొద్దీ దుర్గాంబగుండెల్లో ఆరాటం కూడా మితిమీరుతున్నది.

మమతసూట్ కేసు దుర్గతలదగ్గరే వుంది. ఆ పెట్టెలో ఆమె చిరకాలంనుంచీ చేసిన తపస్సుకి ఫలం దాగివున్నట్లనిపించింది. ఆమెతీరనిదాహాన్ని చల్లార్చే చలివేంద్రం అందులోనే వుంది. దుర్భరదరిద్రబాధతో మగ్గిపోయే దుర్గహృదయంలోని మధురస్వప్నాలన్నిటినీ నిజం చేయగల నిక్షేపం ఆ పెట్టెలో దాగివుంది. కోరికలతో వేడెక్కిపోయిన ఆమెచేతులకి ఆ పెట్టె చల్లగా తగులుతోంది. వొణికే చేతుల్తో ఎన్నోసార్లు ఆ పెట్టెని తాకింది. దాన్ని చేత్తో తాకుతుంటే స్వర్గాన్ని తాకుతున్నట్లే అనిపిస్తోంది.

ఎల్లాగో తెల్లవారింది. వాన వెలవలేదు. అన్నం కోసం పిల్లలు ఏడవటం సాగించారు. దుర్గ రోజూలాగా విసుక్కోలేదు. నిన్నటి బుట్ట తెచ్చి ఒక్కొక్కళ్ళ చేతుల్లో రెండేసి మిఠాయివుండలు పెట్టేసరికి పిల్లలు పొంగిపోయారు. భర్తస్నానానికి నీళ్లుపెట్టి తను వంటకి పొయ్యి రాజేసింది.

శ్రీహరి స్నానానికి వెళ్లాడు. మమత వచ్చి దుర్గని "పిన్నీ, నా పెట్టె ఎక్కడ పెట్టించావు? బట్టలు మార్చుకోవాలి" అంది.

పనిలో వంచిన తల ఎత్తకుండానే దుర్గ "నాగదిలో వుంది. పోయి తీసుకో" అని బదులు చెప్పింది.

గదిలో అడుగుపెడుతూనే మమత తన పెట్టెకేసి చూసి కొయ్యబారిపోయింది. మూత తెరిచి కృష్ణుడు రెండు చీరెలు లాగి ఇవతల పారేశాడు. వాటితోపాటు అద్దం, దువ్వెన, పౌడరుడబ్బాకూడా ఇవతల పడ్డయ్. ఆ విలువైన చీరెలు చాపల్లాగా నేలమీద పరిచి పిల్లలిద్దరూ దొల్లుతూ ఆటలాడుతున్నారు. లుంగలు చుట్టేస్తున్నారు.

పెట్టెదగ్గిరికి పరిగెత్తింది మమత. లోపల చెయ్యి పెట్టి చూసింది. బట్టలూ, లోపలున్న వస్తువులూ ఒకటొకటే తీసి బైట పడేసింది. అసలు వస్తువే అందులో లేదు. వెలతెలబోతున్న ముఖంతో "కృష్ణా, నా డబ్బుల సంచీ ఏది? తీశావా? ఎక్కడపెట్టావు?" అని అడిగింది. వాడు తల తిప్పుతూ "ఏమో, నాకేం తెలుసూ?" అన్నాడు.

"అయితే పెట్టె నువ్వు తెరవలేదూ?" అని ఆవేగంతో అడిగింది.

"అవును. నేనే తీశానూ మూత"

"మా బాబుకదూ. బంగారుకొండవి. నీకో రూపా యిస్తాను. నా సంచీ నాకివ్వు" అని బతిమాలింది.

"ఏమో, నాకేం తెలుసు పో" అన్నాడు కృష్ణుడు పెంకెగా. చిందరవందరగా పడివున్న వస్తువులకేసి నిర్జీవప్రతిమలాగా చూస్తూ కూచుండిపోయింది. డబ్బుసంచీ ఎల్లా పోయిందా అని తీవ్రంగా ఆలోచించసాగింది.

లోపలినుంచి వచ్చే ఆక్రోశాన్ని ఎల్లాగో అణుచుకుని గబగబా పెట్టె సర్దుకుంది. తాళం మాయం అయిపోయింది. త్రాడుతో కడదామని దుర్గదగ్గరికి వెళ్లి "పిన్నీ, ఒక తాడుముక్క ఇస్తావూ?" అని అడిగింది. బదులుగా చీరెనుంచి చింపిన గట్టి జరీఅంచు మమతముందు పడేసింది. అదితీసుకుని పెట్టె గట్టిగా బిగించింది. అప్పుడే స్నానం కానిచ్చి వచ్చిన శ్రీహరి "ఇదేమిటమ్మా, మాయా? అప్పుడే పెట్టె సర్దుతున్నావేమిటి?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

మమత బలవంతాన ఒక చిరునవ్వు ముఖంమీదికి రప్పించి "వెళ్లాలి బాబాయ్. నేనొక ముఖ్యమైన వస్తువు మరచిపోయాను."

"ఈ వానలో ముసురులో ఎల్లా వెళ్తావమ్మా, ఉత్తరం రాస్తే వాళ్లు పంపుతారుగా?"

"కాదు బాబాయ్. ఇవాళ వెళ్లితీరాలి. లేకపోతే చాలా ఇబ్బంది కలుగుతుంది. రైలు ఎన్ని గంటలకి? కాస్త బండీ పిలిచిపెడతావా బాబాయ్"

ఇంకా బలవంతం చెయ్యకుండా శ్రీహరి బండీ కోసం వెళ్ళాడు. రాత్రి దుర్గసంకల్పం విన్నాక మమత ఎంత దబ్బున వెళ్తే అంతమంచి దని అతనికి తోచింది.

నీళ్ళ కి వెళ్ళి దుర్గ తిరిగివచ్చి వసారాలో దిగాలు పడి కూచున్న శ్రీహరిని చూసింది. పిల్లలు గంతులేస్తూ ఆడుకుంటున్నారు. ఎక్కడా మమతఅలికిడి లేదు. ఎక్కడా కనిపించ లేదు. వెళ్ళి పోయింది మమత. వచ్చిన దారినే వెళ్ళింది. తను రేవులో చాలా ఆలస్యంచేసింది. వొంటిమీదా, ముఖంమీదా ఎన్నాళ్ళనుంచో పేరు కున్న మురికిని సువాసనసబ్బుతో పులి కాపుచేసింది. తన చేతుల్ని వాసనచూసుకుంటూ ఆ సుగంధానికి దుర్గ మురిసిపోయింది. మన స్సెందుకో రెక్కలుకట్టుకుని ఎగిరేట్లుగా వుంది. మరిచిపోయిన పాతపాట ఏదో గుర్తుకివస్తే ముక్కుమాటతో కూనిరాగం తీసింది.

గదిలోకి వెళ్ళి దుర్గ బట్టలు మార్చుకువచ్చింది. అత్తరువాసనలు కొడుతున్న బంగారుజరీచీర కట్టుకుంది. గాలిలో తేలిపోతోంది. ఇక తను పూర్తిగా మారి పోవాలని దుర్గ తీర్మానించుకుంది. ఇంకెప్పుడూ కటువుగా మాట్లాడదు. ఆ అమ్మాయిలాగే తనూ ఎంతటి నష్టమైనా మౌనంగా సహిస్తుంది. ఎంతటి అవమానాన్నయినా చిరునవ్వుతో భరిస్తుంది. డబ్బులోనూ, అందంలోనూ, ప్రేమలోనూ, దయలోనూ తను ఆ అమ్మాయికి ఎందుకు తీసిపోతుంది? ఇంటికి కొత్త కప్పూ, తమకి కొత్తబట్టలూ, పాలకి ఆవూ, చుట్టూ ప్రహరీ—అన్నీ సాధించేస్తుంది. తనూ, భర్తా కాపురానికివచ్చిన కొత్తలో వున్నంత సంతోషంగా ఇక ముందు కాలం గడుపుతారు.

ఇంతలో "ఇవాళ వంట చెయ్యవా యేమిటి?" అని అరిచాడు వసారాలోంచి శ్రీహరి.

"చేస్తాను. బంగాళదుంపకూర, ఉల్లిపాయ సాంబారు—" అని దుర్గ అంటుంటే, చికాకుగా శ్రీహరి, "తరవాత పరిహాసాలాడుదుగాని ముందు వంట చెయ్యి. మమతని తరిమివేసినందుకు పొంగిపోతున్నట్లున్నావు. నామన స్సేమీ బాగా లేదు."

ఎన్నడూ లేనంత మృదుస్వరంతో దుర్గ "నాకు మాత్రం విచారం లేదుటండీ?" అని దీర్ఘాలుతీస్తూ వసారాలోకి వచ్చేసరికి ఆ వేషం చూసి శ్రీహరి బిత్తర పోయాడు. "ఏమిటే? నీ గొంతుకూడా మారినట్లుందే? ఒక్కసారిగా కొత్తదాని వైపోయావే?"

విలాసంగా చిరునవ్వునవ్వుతూ దుర్గ "మీరు కొత్తదాన్ని అనుకుంటే కొత్తదాన్నే. ఎందుకల్లా దిగాలుపడి కూచుంటారు? లెండి. నా మాట వినండి. లోపలికి రండి. ఇదుగో—" అంటూ రూపాయలు గలగలలాడించింది.

రూపాయలమోత వినబడేసరికి శ్రీహరి కొరడా దెబ్బతిన్న మనిషిలాగా ఎగిరిగంతేశాడు. అంత అనుకోకుండా మమత వెళ్ళిపోవటానికి కారణం మెరుపులాగా స్ఫురించింది. మమతటాయిలెట్ సామాన్లన్నీ చుట్టూ పరుచుకుని అద్దంముందు కూచుని దుర్గ అద్భుతంగా అలంకరించుకుంది. నుదుటిమీద తిలకం దిద్దింది. తుమ్మెదరెక్కలలాటి సిగచుట్టమీద బంగారు జరీమేలిముసుగు సవరించింది. వేళ్ళతో ఇంత స్నోము తీసుకుని ముఖానికి మర్దనచేస్తోంది.

ఈ అలంకారాలకి ముగ్ధుడు కాలేదు శ్రీహరి. రౌద్రరూపంతో, జ్యోతుల్లాగా మెరిసే కళ్ళతో, కఠిన కంఠస్వరంతో "దుర్గా" అని కేకపెట్టాడు. దుర్గ వెనక్కి తిరిగి చూసింది. సౌమ్యదరహాసంతో, సిగ్గు తొణికే కంఠంతో "ఏమిటండీ?" అంది.

"ఏమిటండీ" అని దుర్గ అన్న స్వరంలోనే వెక్కిరిస్తూ అని, "పెళ్ళికూతురు వేషాలు వేస్తున్నావా? ఈఆటలు కట్టిపెట్టు. నిజం చెప్పు" అన్నాడు శ్రీహరి.

"అబద్ధం చెప్పాల్సిన అవసర మేముందీ?" అంది కళ్ళుతిప్పుతూ.

"నిన్నరాత్రి మమతపెట్టె పగలకొట్టావా?"

అవునని తల వూపుతూ పెంకిపిల్లలాగా "అవును, నిజమే" అంది కొంచెంకూడా సంకోచం లేకుండా.

దాని వస్తువులన్నీ దొంగిలించావా?"

"ఆహా, అన్నీ కాజేశాను. డబ్బుకూడా"

"నీకేం సిగ్గువెయ్యలా ? సంకోచం కలగలా ? పైగా దాని చీరె సింగారించి, దాని స్నో పులుముకుని కులుకుతున్నావా ? పచ్చి దొంగవి" దుర్గ మెత్తగా అంది—"దొంగలు కానివా ళ్లెవరండీ ? కొందరు చేతుల్తో దొంగతనంచేస్తే కొందరు మనస్సుల్తో చేస్తారు"

అపుకోలేని కోపంతో శ్రీహరి గజగజ వణికిపోయాడు. దుర్గ అద్దంవైపు ముఖం తిప్పుకుని "ఎందు కంతకోపం మీకు ? కూచోండి. మమత తెలివితక్కువమొద్దు కాదు. ఇది గ్రహించిందికనకనే మెదలకుండా వెళ్లిపోయింది. ఒక్కసారి ఇల్లా చూడండి. ఇవాళ నేను మీకళ్లకి ఎంత బాగున్నానో చెప్పండీ ?" అంది ఎంతో విలాసంగా.

ఇక సహించలేకపోయాడు శ్రీహరి. పట్టలేని కోపంతో నేలమీద పడ్డ రూపాయిబిళ్ల ఒకటి చేత్తో పుచ్చుకుని బలంకొద్దీ దుర్గముఖాన విసిరికొట్టాడు. ఆ రూపాయి సూటిగా వెళ్లి దుర్గనుదుటికి తాకింది. చీరుకుపోయి నెత్తురు చిమ్మింది. దుర్గ 'అమ్మా' అని ఒక్కమూల్గుమాత్రం మూలిగింది. మెదలకుండా ఒక తువాలు తీసుకుని అతిశాంతంగా గాయాన్ని అద్దుకున్నది. ఎప్పటిలాగా శ్రీహరిమీదికి ఎగిరిమూక లేదు. ఇప్పుడామెకి భర్తమీద కోపం లేదు. ఇప్పుడామె కప్పుఎగిరిన పూరిగుడిసెలో పేదబతుకుబరువుకి కుంగిపోయే నిర్భాగ్యురాలు కాదు. ఇప్పుడు దుర్గ ఆదర్శ గృహలక్ష్మిగా మారిపోయింది కాబోలు ! ఇకనుంచీ కొత్తఅవతారం ఎత్తుతుంది కాబోలు !

తువాలుతో నెత్తురుచుక్కలు తుడిచేసి గాయం మీద ఇంకొంచెం స్నో రాసి వేళ్లతో రుద్దుతూ అద్దంముందు కూచుని ఎంతో ఒయ్యారంగా "కాదు సుమా కల కాదుసుమా !"అని కూనిరాగం అందుకుంది.

(వంగమాతృక ననుసరించి)